క్లుప్తంగా

విద్యార్థుల సమస్యలపై పోరాటం చేస్తాం


వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితో తలారి నవీన్

కనగానపల్లి: వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటం చేస్తామని శ్రీ సత్యసాయి జిల్లా వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ప్రధాన కార్యదర్శి తలారి నవీన్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రెండు రోజుల క్రితం విజయవాడలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కలిసినట్లు తెలిపారు. నిత్యం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు సందర్శిస్తూ విద్యార్థుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని వైఎస్ జగన్ సూచించారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో కలసి పోరాటాన్ని కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

రేపు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తాడిమర్రి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం పదిన్నర గంటలకు ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ మణిమంజరి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు తదితర ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. మండల అధికారులు తమ శాఖల వివరాలు, ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

జాబ్‌మేళాకు స్పందన


ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

ధర్మవరం: పట్టణంలోని శ్రీనివాస డిగ్రీ, పీజీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్‌మేళాకు స్పందన లభించింది. టీసీఎస్, ఐసీఐసీఐ బ్యాంక్ ప్రతినిధులు నిరుద్యోగ ఇంటర్వ్యూలు నిర్వహించారు. 64 మంది అభ్యర్థుల్లో తొమ్మిది మందిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన అభ్యర్థులను కళాశాల చైర్మన్ పల్లె వెంకట కిషోర్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువతీ యువకులకు చేయూతనందించేందుకు కళాశాల తరఫున జాబ్‌మేళా నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఐసీఐసీఐ బ్యాంక్ సీనియర్ హెచ్ఆర్ గోపాలకృష్ణ, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బాబా, కళాశాల ప్రిన్సిపాల్ మునిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబానికి పరామర్శ


నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నేత దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి

నల్లమాడ: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు పొరకల రమణ సోదరి, తలమర్ల క్రిష్ణమూర్తి సతీమణి టి.సరస్వతి (57) అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతి చెందింది. బుధవారం అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సోదరుడు, వైఎస్సార్‌సీపీ నేత దుద్దుకుంట శ్రీనివాసరెడ్డి బుధవారం సరస్వతి మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి టీడీ కేశవరెడ్డి, మాజీ కన్వీనర్ పొరకల రామాంజినేయులు, నాయకులు దుద్దుకుంట వెంకటరెడ్డి, పోలే వెంకటరెడ్డి, శంకర్‌నాయక్, షంషీర్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

హెల్త్ సబ్‌సెంటర్ తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్ రామలక్ష్మి

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని మేడాపురం గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఎస్ఎస్‌గేట్ పీహెచ్‌సీ సూపర్‌వైజర్ రామలక్ష్మి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. కేంద్రంలో ప్రసవాలు ఎలా జరుగుతున్నాయని అక్కడి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఉత్తమ సేవలు అందించాలని సూచించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సుజాత, ఆశావర్కర్లు, పాల్గొన్నారు.

భూసార పరీక్షలు కీలకం


ఎన్‌పీకుంటలో మట్టి నమూనాలు సేకరిస్తున్న విద్యార్థినులు


రాగానిపల్లిలో మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఎన్‌పీకుంట: ఏ పంటలు సాగు చేస్తే ఉపయోగకరమో తెలుసుకునేందుకు భూసార పరీక్షలు ఎంతో కీలకమని వ్యవసాయ సాంకేతిక నిర్వహణ సంస్థ (ఆత్మ) పీడీ ఎం.సి.మద్దిలేటి పేర్కొన్నారు. ఎన్‌పీకుంట మండలం గూటిబైలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ సాయిల్ హెల్త్ ప్రాజెక్ట్ కార్యక్రమంలో భాగంగా బుధవారం వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో భూసార పరీక్షలు, మట్టి నమూనాల సేకరణ, ఎరువుల వాడకంపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆత్మ పీడీ మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు భూసార పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు విద్యార్థుల్లో ప్రకృతిపై ఆరాధనా భావం పెంపొందించడం, వ్యవసాయంపై ఆసక్తి, రైతుల కష్టంపై చిన్ననాటి నుంచే అవగాహన కలిగి ఉండడమే స్కూల్ సాయిల్ హెల్త్ ప్రాజెక్ట్ ఉద్దేశమని చెప్పారు. ఎరువులు, పురుగు మందులు మితిమీరి వినియోగించడం వలన దిగుబడులు తగ్గి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని, ఈ పరిస్థితి తలెత్తకుండా ఉండటానికి ప్రతి మూడేళ్లకు ఒకసారి భూసార పరీక్షలు చేయడం అవసరమని తెలిపారు. భూసార పరీక్షలు చేయడం వలన నేల స్వభావంతో పాటు అందులో ఉన్న పోషకాలు, పోషకాల లోపం, ఆమ్ల, క్షార స్థితి తెలుస్తాయని అన్నారు. తద్వారా ఆ పొలంలో ఏయే పంటలు పండించవచ్చు, ఎరువులను ఎప్పుడు, ఎంత మోతాదులో వినియోగించాలో తెలుస్తుందని పేర్కొన్నారు. అలాగే ఏయే ప్రదేశాలలో మట్టినమూనాలను సేకరించరాదో వివరించారు. కార్యక్రమంలో ఎస్టీఎల్ ఏఓ శ్రీనాథ్‌రెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి లోకేశ్వర్‌రెడ్డి, డీఆర్‌సీ ఏఈఓ ప్రసాద్, ఏఈఓ శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మట్టి నమూనాల సేకరణపై అవగాహన

నల్లమాడ: పొలాల్లో మట్టి నమూనాల సేకరణపై రైతులు, రైతు సేవా కేంద్రం సహాయకులకు బుధవారం నల్లమాడలోని రాగానిపల్లి, ఎద్దులవాండ్లపల్లి, నల్లమాడలో అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయాధికారి సుమతి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాలకు జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు సనావుల్లా హాజరై పరిశీలించారు. పొలాల్లో భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు ఏ విధంగా సేకరించాలనే అంశంపై క్షేత్రస్థాయిలో ఏడీఏ, ఏఓ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

పార్టీలకు అతీతంగా పట్టణ అభివృద్ధి


కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి టౌన్: పార్టీలకు అతీతంగా కదిరి పట్టణాన్ని అభివృద్ధి చేయాలని మున్సిపల్ అధికారులకు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ సూచించారు. బుధవారం మున్సిపల్ కౌన్సిల్ హాల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా ఆధ్యక్షతన మున్సిపల్ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణంలోని 36 వార్డుల పరిధిలో 72 వేల మందికి పైగా జనాభా ఉన్నారన్నారు. ఆయా వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు. మున్సిపల్ కౌన్సిలర్లతో గౌరవంగా వ్యవహరిస్తూ వారు మీ దృష్టికి తెచ్చిన సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. పట్టణంలో అనుకూలమైన ప్రాంతంలో రైతు బజార్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే సూచించారు. ఇదిలా ఉండగా తొలుత అజెండా ప్రకారం సమావేశం జరగలేదు. అజెండాతో పని లేదని, వచ్చే సమావేశంలో అజెండా ప్రకారం వెళదామని కౌన్సిలర్లు మూకుమ్మడిగా ప్రకటించారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ కొమ్ము గంగాదేవి, కమిషనర్ కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు మున్సిపల్ అధికారులు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిత


ఇంగ్లిష్ పుస్తకాలను చూపుతున్న విద్యార్థులు

చెన్నేకొత్తపల్లి: చిన్నారులు క్రమశిక్షణతో చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని దాతలు తెలిపారు. బుధవారం మండల పరిధిలోని ఆమిదాలకుంట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అదే గ్రామానికి చెందిన రామ్‌గోపాల్‌రెడ్డి, పార్థసారథిరెడ్డి తెలుగుతో పాటు ఇంగ్లిష్ భాషను నేర్చుకునేందుకు వీలుగా ఇంగ్లిష్ పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. వీటిని భద్రపరచుకుని శ్రద్ధతో చదువుకోవాలన్నారు. ఈ సందర్భంగా దాతలను పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఓబుళేసుతో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్ బిల్లులు ఉపసంహరించుకోవాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కదిరి టౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్ బిల్లులను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, విధుల నుంచి అక్రమ తొలగింపులు, రాజకీయ నాయకుల వేధింపులు ఆపాలని సీఐటియూ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్, ఆశా వర్కర్స్ యూనియన్ల ఆధ్వర్యంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు కదిరిలో ర్యాలీ నిర్వహించారు. ఆర్అండ్‌బీ బంగ్లా నుంచి క్లాక్‌టవర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు సాగింది. అనంతరం డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జీఎల్ నరసింహులు, జగన్‌మోహన్, రామ్మోహన్, ముస్తాక్, ఆంజనేయులు, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు మాబున్నీసా, సుజాత, రామలక్ష్మి, సుశీల, చంద్రకళ, భాగ్యమ్మ, సరోజ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తిరుపాల్, జనార్దన్, సూరి తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి


చెన్నేకొత్తపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు

నల్లమాడ : తమను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. కోర్కెల దినం సందర్భంగా బుధవారం మండల కేంద్రం నల్లమాడలో ర్యాలీ నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ నాగభూషణంకు అందజేశారు. ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలని, ఇండియన్ లేబర్ కమిషన్ ప్రకారం అంగన్‌వాడీలకు నెలకు రూ.26 వేల వేతన ం చెల్లించాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ మండల నాయకులు గోవిందు, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు రంగమ్మ, మేరీ సుజాత, పద్మావతి, అరుణమ్మ, కమలమ్మ, లక్ష్మీదేవి, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాండ్లపెంట : తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ సిబ్బంది బుధవారం గాండ్లపెంటలోఎంఈఓ కార్యాలయం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యకర్తలు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రీస్కూల్‌ను బలోపేతం చేయాలని, పెన్షన్, పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ శ్రావణికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీఐటీయూ కార్యదర్శి సాంబశివ, అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు లక్ష్మీదేవి, సుజాత, రమణమ్మ మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కనగానపల్లిలో..

కనగానపల్లి: సీఐటీయూ పిలుపు మేరకు బుధవారం అఖిల భారత కోర్కెల దినోత్సవాన్ని మండలంలోని అంగన్‌వాడీల ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల సీఐటీయూ నాయకుడు కదిరప్పతో కలిసి అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు స్థానిక తహసీల్దార్ వద్ద సమావేశమయ్యారు. కార్మికుల డిమాండ్లపై తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా ఉన్న లేబర్ కోడ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ పరిశ్రమల ప్రైవేటీకరణను ఆపాలని కోరారు. అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, సమగ్రశిక్ష సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ సభ్యులు, పలువురు అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి: గత కొన్నేళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. బుధవారం తహసీల్దార్ హమీద్ బాషాను కలిసి వినతిపత్రం అందజేశారు. అఖిల భారత కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఐటీయూ నాయకుడు లింగన్న ఆధ్వర్యంలో మండలంలోని వివిధ గ్రామాల్లో పని చేస్తున్న అంగన్‌వాడీలు తహసీల్దార్ కార్యాలయానికి తరలివచ్చారు. గతంలో అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలని కోరారు. బడ్జెట్ పెంచి, అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని విన్నవించారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రమణమ్మ, కోమల, జయమ్మ, కమలమ్మతో పాటు పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసేవ భగవత్ సేవతో సమానం


విద్యాసామగ్రిని అందజేస్తున్న ఒంటేరు శ్రీనివాసరెడ్డి, శివప్రసాద్‌రెడ్డి తదితరులు

బత్తలపల్లి: చదువుకునే పిల్లలకు సేవ చేస్తే భగవంతునికి సేవ చేసినట్లేనని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి, మంత్రి సత్యకుమార్ ఇంజినీరింగ్ సలహాదారుడు శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. విశ్వనాథపురం ప్రాథమిక పాఠశాలలో బుధవారం ఉపాధ్యాయులు ప్రసాద్, పవన్‌కుమార్‌లు టీవీ వితరణ చేయగా, యువర్స్ ఫౌండేషన్ సభ్యులు విద్యార్థులకు విద్యాసామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాలలను అభివృద్ధి చేసే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలని, విద్యార్థులకు మంచి విద్య లభిస్తే వారు భవిష్యత్తులో మంచి పౌరులుగా మారి దేశానికి సేవ చేస్తారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు ఖలందర్, యువర్స్ ఫౌండేషన్ సంస్థ అధ్యక్షులు నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి జయరాం, గంగిరెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ధర్మవరం అభివృద్ధికి పెద్దపీట


పోస్టర్లు విడుదల చేస్తున్న మంత్రి సత్యకుమార్

ధర్మవరం అర్బన్: ధర్మవరం నియోజకవర్గ అభివృద్ధికి పెద్దపీట వేస్తానని మంత్రి సత్యకుమార్ తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో బుధవారం వైద్య ఆరోగ్యశాఖ, మున్సిపాలిటీ, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్య, వ్యవసాయ, విద్యుత్, పశుసంవర్ధక, గనులు, రిజిస్ట్రేషన్ తదితర శాఖల అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ధర్మవరాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు అధికారులు సహకారం అందించాలని సూచించారు. అనంతరం డిప్యూటీ డీఎంహెచ్ఓ సెల్వియా సాల్మన్ ఆధ్వర్యంలో ప్రపంచ జనాభా దినోత్సవ పోస్టర్లను మంత్రి చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకట శివరామిరెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్, టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన ఇన్‌చార్జ్ చిలకం మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించండి

తలుపుల : ప్రజాప్రతినిధులు గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజా సమస్యలను మీ దృష్టికి తెస్తే సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని ఎంపీపీ రఫినాయక్ అధికారులకు సూచించారు. ఐకేపీ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన ఎంపీడీఓ మహబుబ్‌ఖాన్ ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. మండలంలో విద్యుత్ స్తంభాలు, లైన్ల మార్పిడి చేసి ప్రజల ప్రాణాలను కాపాడాలని ఏఈ శివతేజకు సభ్యులు సూచించారు. వైస్ ఎంపీపీ మహేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

టీకాలు తప్పనిసరిగా వేయించాలి

తాడిమర్రి: చిన్నారులకు వ్యాధినిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని సీహెచ్ఓ హేమలత సూచించారు. తాడిమర్రి ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో బుధవారం జరిగిన వ్యాధి నిరోధక టీకాల పంపిణీ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రతి బుధవారం చిన్నారులకు బీసీజీ, పెంటా, హెపటైటీస్ బీ, రోటా, పీసీవీ, ఓపీవీ, ఎమ్మార్ తదితర టీకాలను వేస్తారన్నారు. మండలంలోని విలేజ్ క్లీనిక్‌ల్లో చిన్నారులకు టీకాలు వేసినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పీహెచ్ఎన్ లక్ష్మీ, ఏఎన్ఎంలు కోమలి, కృష్ణమ్మ, సుగుణ, లక్ష్మీకాంతమ్మ, నాగలక్ష్మమ్మ, ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

తలుపుల: మండలంలోని బట్రేపల్లి– తలుపుల మార్గంలో కల్లీల మిట్ట వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలయ్యాయి. తలుపులకు చెందిన ఖాదర్‌బాషా, అమ్మాజాన్ దంపతులు ద్విచక్రవాహనంపై కదిరికి వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఖాదర్‌బాషా కాలుకు ఫ్రాక్చర్ అయ్యింది. అమ్మాజాన్‌కు గాయాలయ్యాయి. వాహనదారులు గుర్తించి క్షతగాత్రులను 108 వాహనంలో కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించండి


ధర్మవరంలో సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు, మున్సిపల్ కార్మికుల ర్యాలీ

ధర్మవరం అర్బన్: అంగన్‌వాడీలు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా కార్మికుల కోర్కెల దినోత్సవం సందర్భంగా బుధవారం అంగన్‌వాడీ వర్కర్లు, మున్సిపల్ కార్మికులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి, అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఈశ్వరయ్యకు వినతిపత్రం అందించారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, కార్యదర్శి ఎల్.ఆదినారాయణ, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సీపీఎం సీనియర్ నాయకులు ఎస్‌హెచ్‌బాషా, జేవీ రమణ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి చంద్రకళ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం రూ.26వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీని అమలు చేయాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ధర్మవరం పట్టణంలో ఉద్యోగులు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటు చేయాలని, పెన్షన్, రిటైర్‌మెంట్ బెనిఫిట్ సౌకర్యం కల్పించాలని, మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా గుర్తించాలని, అసంఘటిత కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి రెగ్యులరైజ్ చేయాలని, కేంద్ర ప్రభుత్వం స్కీం పథకాలకు బడ్జెట్ పెంచాలని, అంగన్‌వాడీ, మున్సిపాలిటీ, ఆశా, మధ్యాహ్న భోజన తదితర కార్మికులకు అన్ని సంక్షేమ పథకాలను అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, పట్టణ నాయకులు ముకుంద, చెన్నకేశవులు, డీవైఎఫ్ఐ నాయకులు బాలాజీ, అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ నాయకురాలు దీనా, పోతక్క, అరుణ, చింతమ్మ, ఫాతిమా, గోవిందమ్మ, మాంచాలినిదేవి, ప్రభావతి, మున్సిపల్ నాయకులు కేశవ, వెంకటేష్, చంద్ర, సాలమ్మ, చెన్నమ్మ, పెద్దక్క తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువు : అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీలు ఓడీచెరువులోని ర్యాలీ నిర్వహించి, వైఎస్సార్ సర్కిల్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. దేశవ్యాప్త కోర్కెల దినోత్సవంలో భాగంగా తమ కోర్కెలు, డిమాండ్ల సాధన కోసం తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. సీఐటీయూ నాయకులు శ్రీరాములు, లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ కార్యకర్తలు జయమ్మ, కళావతి, అఖిల, ఆశీర్వాదమ్మ, షమీమ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువు: తమ సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి రామక్రిష్ణ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు తహసీల్దార్ రవికుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పద్మావతి, సుజాత మణి, సరస్వతి, షరిమ్మల, మంజుల, ధనమ్మ, బాబయ్య, ఆంజనేయులు, రఘుపతి, తదితరులు పాల్గొన్నారు.

తనకల్లు: కార్మికుల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రం తనకల్లులో బుధవారం ఆశా కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ శోభ సువర్ణమ్మకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శివన్న, ఒంటెద్దు వేమన్న, నరసింహారెడ్డి, రమణ, శ్రీనివాసులు, శ్రీనివాసులు, భాగ్యమ్మ, కళావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: మండల కేంద్రం ముదిగుబ్బలో బుధవారం సీఐటీయు ఆధ్వర్యంలో డిమాండ్స్ డే నిర్వహించారు. ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పంచాయతీ కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు సీనియర్ అసిస్టెంట్ రాఘవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

కనగానపల్లి: తమ న్యాయపరమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని సమగ్రశిక్ష ఔట్ సోర్సింగ్ సిబ్బంది కోరారు. సమగ్రశిక్ష జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బుధవారం భోజన విరామ సమయంలో జిల్లా జేఏసీ ప్రధాన కార్యదర్శి ఎంఐఎస్ రామన్న ఆధ్వర్యంలో స్థానిక ఎంఈఓ కార్యాలయం ఎదుట మండల ఔట్ సోర్సింగ్ సిబ్బంది ప్లకార్డులతో అరగంట పాటు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ నుంచి తమను కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చాలన్నారు. హెచ్ఆర్ పాలసీ, ఎంటీఎస్ వర్తింపు చేయాలన్నారు. పెండింగ్ వేతనాలు, సమ్మె కాల జీతాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు మారుతిప్రసాద్, వరలక్ష్మి, సుకన్య, ఐఈఆర్‌పీ జగదీష్, అకౌంటెంట్ రాజేష్, సీఎం నారాయణ స్వామి, పీటీఐలు శ్రీదేవి, ఉమాదేవి పాల్గొన్నారు.

కాశీంస్వామికి నిత్యపూజ నివేదన


బత్తలపల్లిలోపూజలు అందుకుంటున్న కాశీంస్వామి పీరు

బత్తలపల్లి: మొహర్రం వేడుకల్లో భాగంగా బత్తలపల్లి కాశీంస్వామికి బుధవారం నిత్యపూజ నివేదన నిర్వహించారు. ఉదయం ముజావర్లు జిలానీ, టైలర్ రియాజ్, మహబూబ్‌బాషా, నజరుల్లా, కాశీంవలిలు కాశీంస్వామి పీర్ల చావిడిలో ఫాతెహా చేశారు. మండలంలోని గంటాపురం, ముష్టూరు, మాల్యవంతం, సంజీవపురం, రాఘవంపల్లి, యర్రాయపల్లి, లింగారెడ్డిపల్లి, అనంతసాగరం, వెంకటగారిపల్లి తదితర గ్రామాల్లో మొహర్రం వేడుకలకు అంకురార్పణ చేశారు. మొహర్రం నిర్వహణపై ఎస్ఐ శ్రీనివాసులు వివిధ గ్రామాల పెద్దలు, ముజావర్లతో పోలీస్ స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. పోలీసుల అనుమతులు లేకుండా ఏ గ్రామంలోనూ మొహర్రం నిర్వహించరాదన్నారు. గ్రామాల్లో గట్టి బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు సీఐ ఆరోహణరావు, ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

దోషులను కఠినంగా శిక్షించాలి


పుట్టపర్తిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న వాల్మీకి సంఘం నాయకులు

పుట్టపర్తి రూరల్: నంద్యాల జిల్లా పడిద్యాల మండలం ఎల్లారు గ్రామానికి చెందిన వాల్మీకి వాసంతిపై హత్యాచారం చేసిన వారిని కఠినంగా శిక్షించాలని వాల్మీకి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం పుట్టపర్తిలో వాల్మీకి సంఘం నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంవీఆర్‌పీఎస్ రాష్ట్ర యూత్ అధ్యక్షులు చిన్న నరసింహులు, వీఆర్‌పీఎస్ నాయకులు లక్ష్మీనారాయణ, రాష్ట్ర వాల్మీకి చైతన్య ప్రధాన కార్యదర్శి పాదయాత్ర శంకర్, నాయకులు పుట్ల గంగాద్రి, కె.గంగాద్రి, గంగరాజు, శ్రీనివాసులు, తలారి చంద్రశేఖర్, రామకృష్ణ, సోముశేఖర్ తదితరులు పాల్గొన్నారు